ప్రజాశక్తి

సోమవారం 1 డిసెంబర్ 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

తప్పిన తుపాను ముప్పు

కొనసాగుతున్న చలిగాలులు - నేడు వర్షాలు కురిసే అవకాశం - ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నాల్లో రైతులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాకు దిత్వా తుపాను ముప్పు తప్పింది. తుపాను బలహీనపడి వాయుగుండగా మారడంతో క్రమంగా ముప్పుతప్పినట్టేనని అధికారులు అంచనా వేస్తున్నారు. సోమవారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలకు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. తుపాను ప్రభావంతో ఆదివారం పలు చోట్ల జల్లులు పడ్డాయి. డెల్టాలో ఒక మోస్తరుగా వర్షం కురిసింది. మిగతా ప్రాంతాల్లో జల్లులు పడగా ఆకాశం మేఘావృతమైంది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో తుపాను ప్రభావంతో చలిగాలులు కొనగుతున్నాయి.

మరో వైపు గాలులకు వరి పైరు నేలవాలిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరి కోత కోసిన రైతులు తమ పంటను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని బస్తాలకు ఎత్తి కొంత మంది ఇళ్లకు చేరుస్తుండగా మరికొంత మంది స్థలాభావంతో అయినకాడికి అమ్ముకుంటున్నారు. కోత కోసిన ధాన్యంను నిల్వ చేసుకునేందుకు అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అవకాశంగా చేసుకుని వ్యాపారులు ధాన్యం ధరను బాగా తగ్గించారు. ఆదివారం డెల్టాలో జల్లులు ప్రారంభం కావడంతో కళ్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని అదరాబాదరాగా బస్తాల్లోకి ఎత్తి అమ్ముకున్నారు.

▶ 2లో

రోడ్డుపై ఆరబోసిన ధాన్యాన్ని టార్పాలిన్ పట్టాలతో కప్పుతున్న రైతులు

దిత్వ తుపాను వరి రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో వరికోతలు పూర్తిచేసి ధాన్యాన్ని కళ్లాల్లో, రోడ్లపైనా ఆరబెడుతున్నారు. తుపాను నేపథ్యంలో కురుస్తున్న వానల వల్ల ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు టార్పాలిన్ పట్టాలను కప్పుతున్నారు. అయితే రైతులకు సరిపడా టార్పాలిన్ పట్టాలను ప్రభుత్వం అందించకపోవడంతో రైతులు దుకాణాల చుట్టూ పరుగులు పెడుతున్నారు. అధిక మొత్తలు చెల్లిస్తూ పట్టాలు కొనుగోలు చేస్తున్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర

తల్లీకొడుకును హత్య చేసిన మైనర్లు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మృతులు కృష్ణకుమారి, సాంబశివరావు (ఫైల్)

కుటుంబ వివాదాల కారణంగా మైనర్లయిన విద్యార్థులు కలిసి ఇద్దర్ని హతమార్చిన ఘటన మండలంలోని ధూళిపాళ్లలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన తెలిపిన వివరాల ప్రకారం.. దూళిపాళ్ల గ్రామానికి చెందిన దొప్పలపూడి సాంబశివరావు (35) గుంటూరు జిల్లా తాడికొండ మండలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. సావశివరావుకు పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన చెరుకూరి సాహితీతో 2022లో వివాహమైంది. పెళ్లయిన కొంతకాలానికే ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో కోర్టును ఆశ్రయించి ఆరు నెలల కిందట విడాకులు తీసుకున్నారు. అయితే తన అక్కను సాంబశివరావు ఇబ్బందులు పెట్టాడని అతనిపై గుంటూరు రూరల్ పరిధిలోని ఓ ప్రైవేటు ఇంజినీరంగ్ కాలేజీలో పాలిటెక్నిక్ చుదువుతున్న చెరుకూరి రోహిత్ చౌదరి కక్షపెంచుకున్నాడు. ఆదివారం మరో ఇద్దరు స్నేహితులతో కలిసి మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై ధూళిపాళ్లలోని సాంబశివరావు ఇంటికి వచ్చారు. సాంబశివరావుపై వీరు కత్తితో దాడి చేసి చంపుతుండగా అతని తల్లి కృష్ణకుమారి (58) అడ్డురావడంతో ఆమెపైనా దాడి చేశారు. సాంబశివరావు అక్కడికక్కడే మృతి చెందడంతో నిందితులు అక్కడి నుండి పరారయ్యేందుకు యత్నించారు. ఈ క్రమంలో అరుపులు విన్న స్థానికులు అక్కడికి చేరుకుని పరిశీలించగా సాంబశివరావు, కృష్ణకుమారి రక్తపు మడుగులో పడి ఉండడం గమనించారు. కృష్ణకుమారిని సత్తెనపల్లిలోని ఏరియా ఆస్పత్రికి, అనంతరం గుంటూరు జిజిహెచ్‌కు తరలించగా కొద్దిసేపటికి ఆమెకూడా మృతి చెందారు. మరోవైపు నిందితులు పారిపోతుండగా గ్రామస్తులు వెంబడించి పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలిని సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతురావు, రూరల్ సిఐ ఎం.హైమారావు పరిశీలించారు. మృతుడు సాంబశివరావు సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఇదిలా గత అక్టోబరు 7న గుంటూరులో తన సోదరిని ప్రేమ వివాహం చేసుకున్నాడనే అక్కసుతో బావను బావమరిది దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం యడవర్రుకు చెందిన కుర్రా గణేష్, వీరాంజనేయ దేవిని ప్రేమ వివాహం చేసుకోగా తన చెల్లెలు కంటే బావ పొట్టిగా ఉన్నాడన్న కారణంతో బావమరిది కీర్తి దుర్గారావు.. గణేశ్‌ను మరో ఇద్దరికితో కలిసి హత్య చేశాడు. బావమరిది క్షేమం కోరతాడు అనే నానుడికి భిన్నంగా ఇటీవల కాలంలో సొంతబావలనే హత్య చేస్తున్న ఘటనలు పలు కుటుంబాలను క్షోభకు గురిచేస్తున్నాయి.

సత్తెనపల్లిలో కొవ్వొత్తులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న సిపిఎం, ప్రజాసంఘాలు

గంజాయి ముఠాను కఠినంగా శిక్షించాలి

పెంచలయ్యను హత్యచేయడంపై సిపిఎం, ప్రజా సంఘాల నిరసన

ప్రజాశక్తి-సత్తెనపల్లి, తాడేపల్లి

గంజాయికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న నెల్లూరు జిల్లాకు చెందిన పెంచలయ్యను హత్యచేసిన గంజాయి ముఠాను కఠినంగా శిక్షించాలని సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సత్తెనపల్లి, తాడేపల్లిలో నిరసన ప్రదర్శనలు చేశారు. సత్తెనపల్లిలో పుతుంబాక భవన్ నుండి స్థానిక తాలూకా సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలయమ్య మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ కాలంలో రాష్ట్రమంతా గంజాయి మత్తు పదార్థాలు మాఫియాతో నిండిపోయిందని, తాము అధికారంలోకి వస్తే గంజాయి రహిత రాష్ట్రంగా మారుస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడేం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. యువత గంజాయి బారిన పడి పక్కదోవ పట్టకుండా నెల్లూరు జిల్లాలో ప్రచారం నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ నాయకుడు, ప్రజా కళాకారుడు పెంచలయ్యను దారుణంగా హత్య చేయడంపై కూటమి ప్రభుత్వం కానీ, కూటమి పార్టీలకు చెందిన టిడిపి ,జనసేన, బిజెపిగాని, విపక్ష వైసిపి నాయకులుగాని గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఎక్కడైనా మాట్లాడం, లేదా ప్రచారం చేయటం గాని చేస్తున్నారా? అని నిలదీశారు. రాష్ట్రంలో 70 శాతం మంది

▶ 2లో

ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో ముఖేష్‌కు స్వర్ణం

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో గుంటూరుకు చెందిన నేలవల్లి ముఖేష్ స్వర్ణ పతకం సాధించాడు. నవంబర్ 24 నుంచి రాజస్థాన్లోని జైపూర్‌లో ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ షూటింగ్ పోటీలు జరుగుతున్నాయి. ఆదివారం రాజస్థాన్ స్టేట్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో కెఎల్ యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహించిన నేలవల్లి ముఖేష్ స్వర్ణ పతకం గెలిచాడు. రిలేలో 600కు గాను 578 పాయింట్లు సాధించి నాలుగో స్థానంలో నిలిచిన ముఖేష్, ఫైనల్ మ్యాచ్‌లో మొదటి నుంచే పూర్తి ఆధిక్యత ప్రదర్శించి బంగారు పతకం సాధించాడు. పంజాబ్ యూనివర్సిటీకి చెందిన అంతర్జాతీయ క్రీడాకారుడు ఆదిత్య మల్రా రజత పతకం గెలవగా, పంజాబ్ యూనివర్సిటీకే ప్రాతినిధ్యం వహించిన ఒలింపిక్ కాంస్యపతక విజేత సరబ్ జ్యోత్ సింగ్ కాంస్య పతకం గెలిచాడు. ఈ యూనివర్సిటీ గేమ్స్‌లో నవంబర్ 27న జరిగిన 25 మీటర్ల రాపిడ్ ఫైర్ పిస్టల్

▶ 2లో

సిఐటియు ఆఖిల భారత మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

స్త్రీశక్తి పథకంపై 14న రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

స్త్రీ శక్తి పథకంలోని సమస్యల పరిష్కారం కోసం 14న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్‌డబ్ల్యూఎఫ్ జనరల్‌బాడీ సమావేశం ఎంవిఎస్ రామకృష్ణ అధ్యక్షతన పాతగుంటూరు సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం జయప్రదంగా అమలు జరగటం వల్ల ఆర్టీసీకి, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందని, ఆర్టీసీకి ఆక్యుపెన్సీ రేషియో గణనీయంగా పెరిగిందని చెప్పారు. అయితే పెరిగిన ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్యమాత్రం పెరగలేదన్నారు. తగినంత సిబ్బంది లేరని, పథకం అమలులో తీవ్ర ఒత్తిడిలో జరిగిని చిన్న పొరపాట్లకు గుంటూరు జిల్లాలో 9 మంది కండక్టర్లు అక్రమంగా సస్పెన్షన్‌కు గురయ్యారని తెలిపారు. ఆక్రమ సస్పెన్షన్లు ఆపాలని, బస్సుల సంఖ్య పెంచాలని, నూతన రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టటం ద్వారా కార్మిక హక్కులు కాపాడుకోవాలని అన్నారు. లేబర్ కోడ్‌లు కార్మికులకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్నాయన్నారు. డిసెంబర్ 30 నుండి జనవరి 4వ తేదీ వరకూ విశాఖపట్టణంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిప్రసాద్, రవిశంకర్, మురళీకృష్ణ, మధుసూదనరావు, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'మీకోసం' కాల్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు వచ్చే అర్జీదారులు 'మీ కోసం' కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు. అర్జీదారులు వారి అర్జీలు meekosam. ap.gov.in వెబ్సైట్లో నమోదు చేసుకోవాలని సూచించారు. నరసరావుపేటలోని కలెక్టర్‌లో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరవుతారని తెలిపారు.

మూడ్రోజుల వరకు వరికోతలు వద్దు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

వర్షాలు కారణంగా రైతులు ఎవరు వరి పంట కోయవద్దు అని వ్యవసాయాధికారి షేక్. సుగుణ బేగం అన్నారు .దిత్వ తుఫాన్ కారణంగా మూడు రోజుల తరువాత కోతలు ప్రారంభించాలని సూచించారు.ముందుగానే వరి కోసిన రైతులు సురక్షిత ప్రాంతాల లో భద్రంగా పెట్టుకోవాలి అని తెలియచేశారు. మాంకోజెబ్ లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సి ఓ సి) పిచికారీ చేయాలి. (లేదా) ప్రొపికోనజోల్ గాని లేక క్రెసోక్సిమ్ మిథైల్ గాని 1 మీ.లీ./ లీ. మోతాదులో పిచికారీ చేయాలి.

పాలపర్రులో నేడు ఎరువుల కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పెదనందిపాడు : సోమవారం ఉదయం 11 గంటలకి పెదనందిపాడు మండలంలోని అన్నవరం గ్రామంలో పలు అభివద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, 12 గంటల 30 నిమిషాలకు పాలపర్రు గ్రామంలో ఎరువుల గిడ్డంగి ప్రారంభోత్సవం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ మరియు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమములు జరుగుతాయని పెదనందిపాడు టిడిపి మండల అధ్యక్షులు కోడూరి రఘు రామారావు (రాంబాబు) తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు, మాజీ మంత్రివర్యులు మాకినేని పెదరత్తయ్య మరియు జిడిసిసి బ్యాంకు అధ్యక్షులు వడ్డాణం హరిబాబు పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలములోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా రాంబాబు కోరారు.

3న అగ్రిగోల్డ్ బాధితుల చలో విజయవాడ

ప్రజాశక్తి - దుర్గి : విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నుండి ధర్నా చౌక్ వరకు 3వ తేదీన ఆవేదన యాత్ర, అనంతరం దీక్షలు ఉంటాయని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ పల్నాడు జిల్లా కార్యదర్శి వి.మధుసూదనరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అగ్రిగోల్డ్ కంపెనీ 8 రాష్ట్రాలలో 32 లక్షల మంది డిపాజిటర్లను ఏజెంట్లను నిలువు దోపిడీ చేసి 2026 జనవరి 4వ తేదీకి 12 ఏళ్లు అవుతుందని, రాష్ట్రంలో 19 లక్షల 52 వేల మంది నుండి రూ.3986 కోట్లను కొల్లగొట్టగా, సుమారు 600 మందికి పైగా ఆత్మహత్యలు, గుండెపోటులకు, మనోవేదనలకు గురై ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మిగతా బాధితులకు న్యాయం చేస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్ హామీలిచ్చినా ఇంకా కాలయాపన చేస్తూనే ఉన్నారని, ఈ నేపథ్యంలో చేపట్టే దీక్షల్లో బాధితులంతా పాల్గొనాలని కోరారు. ఉద్యమాల ఫలితంగా రూ.20 వేలలోపున్న 10 లక్షల 43 వేల మందికి రూ.906 కోట్లను తిరిగి ఇప్పించగలిగామని, 142 మంది చనిపోగా వారి రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియాను ఇప్పించామని పేర్కొన్నారు.

19 మందికి సిఎం సహాయనిధి

ప్రజాశక్తి-చిలకలూరిపేట : నియోజకవర్గంలోని నాదెండ్ల మండలానికి చెందిన 19 మందికి రూ.7.1 లక్షల సిఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పట్టణంలోని తన నివాసంలో ఆదివారం అందించారు. ముందస్తు చికిత్స నిమిత్తం పట్టణానికి చెందిన మూడవత్ లక్ష్మీభాయికి రూ.70 వేల ఎల్‌వోసీని అందించారు. కార్యక్రమంలో బి.సత్యనారాయణ, జి.శ్రీనివాసరావు, జి.రమేష్, వి.హిమవంతరావు పాల్గొన్నారు.

తాడేపల్లిలో నిరసన

గంజాయి ముఠాను కఠినంగా శిక్షించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు, ప్రతినిధులు ఈ గంజాయి డ్రగ్స్ వంటి అక్రమ వ్యాపారాలతో, అక్రమ సంపాదనలో నిమగ్నమై ఉన్నారని, వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉందని విమర్శించారు. ఈ చర్యల వల్లే గ్రామగ్రామానికి, చివరికి కాలేజీలకు కూడా గంజాయి సరఫరా అవుతోందని మండిపడ్డారు. దేశాభివృద్ధికి వెన్నుముకగా ఉండాల్సిన యువతను పక్కదో పట్టించి, వ్యసనపరులుగా మారుస్తూ వ్యాపారం చేసుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని, పెంచలయ్యను హతమార్చిన గంజాయి ముఠాను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని బోసుబొమ్మ సెంటర్‌లో సిపిఎం నిరసన చేపట్టగా పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, కార్యదర్శివర్గ సభ్యులు డి.శ్రీనివాసకుమారి మాట్లాడారు. సత్తెనపల్లిలో కార్యక్రమానికి డివైఎఫ్ఐ నాయకులు జె.రాజ్‌కుమార్ అధ్యక్షత వహించగా సిపిఎం పట్టణ, రూరల్, ముప్పాళ్ల మండల కార్యదర్శులు డి.విమల, పి.మహేష్, జి.బాలకృష్ణ, నాయకులు జి.రజిని, కె.శివదుర్గారావు, ఎ.వీరబ్రహ్మం, బి.భాస్కర్, జి.సుసలోవ్, మస్తాన్‌వలి, వెంకట్ నారాయణ, జి.ఉమశ్రీ, షేక్ సాయిబా, షేక్ సైదులు, కె.జగన్, జివిస్ రత్నం, పి.ప్రభాకర్, కె.సుధారాణి పాల్గొన్నారు. తాడేపల్లిలో వి.దుర్గారావు, డి.వి భాస్కర్‌రెడ్డి, కె.మేరీ, ఎమ్‌డి బాజ్జీ, ఫిరోజ్‌ఖాన్, దశరథ రామిరెడ్డి, శాస్త్రి, శ్రీరాములు, పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

తప్పిన తుపాను ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

75 కిలోల బస్తాకు కనీస మద్దతు ధరప్రకారం రూ.1792 దక్కాల్సి ఉండగా బస్తా కేవలం రూ.1300కు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేశారని రైతులు తెలిపారు.

మరోవైపు వర్షం నుంచి బయటపడేందుకు ధాన్యం నిల్వ చేసుకునేందుకు టార్పాలిన్ పట్టాలు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 1,62,883 ఎకరాల్లో వరి సాగు చేశారు. పల్నాడులో లక్ష ఎకరాల్లో వరి సాగైంది. తెనాలి, కొల్లిపర, పొన్నూరు, దుగ్గిరాల మండలాల్లో వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. చేబ్రోలు, కాకుమాను, వట్టిచెరుకూరు, తాడేపల్లి, మంగళగిరి, తాడికొండ మండలాల్లో కోతలు నాలుగు రోజుల క్రితం ప్రారంభమయ్యాయి. 17 శాతం కంటే ఎక్కువ తేమ ఉంటే కొనుగోలు కేంద్రాల్లో తిరస్కరిస్తున్నారు. వరికోతలను యంత్రాల ద్వారా చేసి వెంటనే నూర్పిడి చేయడం వల్ల తేమ శాతం అధికంగా ఉంటోంది. దీంతో ధాన్యం ఆరబెట్టుకునేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. మిషన్ల ద్వారా కోతలకు కూడా అధికంగా ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. కళ్లాల్లో ఆరబోసుకున్న వారు కంటిపై కునుకులేకుండా కాపాలా ఉండాల్సి వస్తోంది.

ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో ముఖేష్‌కు స్వర్ణం

(మొదటి పేజీ తరువాయి)

టీం విభాగంలో నేలవల్లి ముఖేష్, తనిష్క్ మురళీధర్ నాయుడు, నాగసాయి తరుణ్‌తో కూడిన కెఎల్ యూనివర్సిటీ జట్టు రజత పతకం సాధించింది. స్వర్ణ పతకం సాధించిన ముఖేష్‌ను రాష్ట్ర రైఫిల్ అసోసియేషన్ కార్యదర్శి డి.రాజకుమార్, కెఎల్ యూనివర్సిటీ స్పోర్ట్స్ విభాగం డీన్ హరికిషోర్, పీడీలు గౌతం, శ్రీహరి అభినందించారు.

మెగా వైద్యశిబిరాల్లో ఉచితంగా పరీక్షలు, మందులు

ప్రజాశక్తి - రాజుపాలెం

ఉచిత మెగా వైద్య శిబిరానికి అపూర్వ స్పందన వచ్చిందని డాక్టర్ సింగరాజు సాయికష్ణ తెలిపారు. ఆదివారం రాజుపాలెం మండలంలోని గణపవరం గ్రామంలో సత్తెనపల్లి సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సింగరాజు చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. 250 మందికి సాధారణ, గుండె సంబదిత, ఊపిరితిత్తులకు సంబంధించి పరీక్షలు చేయడంతోపాటు అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, డాక్టర్ సింగరాజు విద్య, గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్‌కు చెందిన గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల శివప్రసాద్ వైద్యసేవలు అందించారు. మాజీ సర్పంచ్ ఎన్.లక్ష్మీనారాయణ, వి.వెంకట్రావు, కె.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, సలీం, ఆర్ఎంపిలు సురేష్, రంగబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి నాదెండ్ల

స్థానిక శ్రీ సాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు శ్రీ సాయి సత్య హాస్పిటల్ గుంటూరు వారు ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. 135 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారిని మెరుగైన చికిత్స కోసం తమ ఆసుపత్రికి డాక్టర్ శ్రీనివాస నాయుడు సిఫార్సు చేసినట్లు ఆస్పత్రి ప్రతినిధి అల్లూరి సుధాకర్‌బాబు తెలిపారు.

రాజధానిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం

ప్రజాశక్తి - దుర్గి

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు 58 అడుగుల కాంస్య విగ్రహం, స్మృతివనం కోసం రాజధాని ప్రాంతంలో 6.58 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ ఈ మేరకు ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 58 అడుగులు ఎత్తు 17 అడుగులు వెడల్పుతో విగ్రహం 11,832 ఘనపు అంగుళాలు ఉంటుందని, పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా మార్చి 16న విగ్రహ ఆవిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి తోపాటు వర్ధంతి అయిన డిసెంబరు 15ను ప్రభుత్వ కార్యక్రమాలుగా జీవో ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశానికి జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షులు కె.అనిల్ కుమార్ అధ్యక్షత వహించగా పల్నాడు జిల్లా ఆర్య వైశ్యసంఘ అధ్యక్షులు ఎ.సుబ్బారావు, కె.వెంకటేశ్వర్లు, పి.నరసింహారావు, ఎలమంద, చంటి, వెంకటేశ్వర్లు, రమేష్, లక్ష్మీ ప్రమీల, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పోస్టల్ ఏజెంట్ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ది నేషనల్ స్మాల్ సేవింగ్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చిలకలూరిపేట నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాలన్ని స్థానిక వివేకా నంద కాంప్లెక్స్ మెడికల్ అసోసియేషన్ హాలులో ఆదివారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా గుంటుపల్లి ఎస్ఎ.భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.వెంకటేశ్వరరావు, అధ్యక్షులుగా బొప్పూడి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా బి.వెంకట రామారావు, కార్యదర్శి ఎన్.శ్రీదేవి, జాయింట్ సెక్రెటరీగా సత్యనారాయణమూర్తి, కోశాధికారిగా కె.ఆదినారాయణ, కార్యవర్గ సభ్యులుగా జి.రామారావు, ఎన్.మహాలక్ష్మి, కె.సాంబశివరావు, ఎన్.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వరరావు, ఎస్.హనుమంతరావు, కె.ప్రభాకర్, బాలకృష్ణ నాయక్, టీవీఎం పవన్ కుమార్, సిహెచ్ శ్రీనివాసరావు, టెక్నికల్ అడ్వైజర్‌గా ఎంవి మాధవకృష్ణతో రాష్ట్ర నాయకులు కొత్తూరు సాంబశివరావు ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బొప్పూడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏజెంట్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. చిలకలూరిపేట డాక్ ఘర్ పోస్ట్ మాస్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఏజెంట్లు పరంగా తమ పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామన్నారు.

ఎన్ఎస్‌పి ఎస్ఇ కృష్ణమోహన్‌కు సత్కారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ఎన్ఎస్‌పి సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.కృష్ణమోహన్ ఉద్యోగ విరమణ సభను నరసరావుపేటలోని ఎస్ఎన్ఆర్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరై కృష్ణమోహన్ సేవలు కొనియాడారు. కృష్ణమోహన్‌ను సహోద్యోగులు, సన్నిహితులు సత్కరించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నవోదయ పరీక్షల ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు ఆదివారం స్థానిక కేర్ ఐఐటీ స్కూల్‌లో జిల్లా స్థాయి నవోదయ పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరై బహుమతులు అందించి మాట్లాడారు. ఇలాంటి పరీక్షల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని, ఉత్తమ ప్రదర్శన ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని చెప్పారు.

మానవత సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ మోడల్ టెస్ట్

ప్రజాశక్తి-గుంటూరు

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఏసీ కాలేజిలో ఆదివారం సంస్థ కార్యదర్శి కె.సతీష్ నేతృత్వంలో ఎన్ఎంఎంఎస్ గ్రాండ్ మోడల్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌కు 780 మంది విద్యార్థులు హాజరైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సతీష్ మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ సెప్టెంబర్ 1 నుండి ప్రతి ఆదివారం ఏసీ కాలేజిలో ప్రత్యక్ష శిక్షణా తరగతులు, ప్రతిరోజు 2 గంటలపాటు ఆన్లైన్‌లో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు ముగిసిన సందర్భంగా మోడల్ టెస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కోచింగ్ మెటీరియల్ ఉచితంగా అందజేసిన వి.జి.ఎస్ పబ్లిషర్స్ అధినేత ఎస్.రామారావుకి, అసెంబ్లీ హాల్ సమకూర్చిన ఏ.సి కళాశాల యాజమాన్యానికి కతజ్ఞతలు తెలిపారు.గుంటూరు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ జి.ఏసురత్నం మాట్లాడుతూ చిన్న వయస్సులోనే విద్యార్థులను పోటీ పరీక్షలకు తీర్చి దిద్దేలా మానవత నిర్వహిస్తున్న శిక్షణ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందన్నారు. ప్రజా ప్రయోజనార్థం మానవత లాంటి సంస్థలు చేపడుతున్న బహుముఖ కార్యక్రమాలలో ప్రజలు, ప్రభుత్వాలు భాగస్వామ్యం కాగలిగితే విస్తత ప్రయోజనాలను అందించగలమన్నారు. బాలబాలికలు

మాట్లాడుతున్న ఏసురత్నం

చిన్నతనం నుండే లక్ష్యాలను నిర్దేశించుకొని ఆ దిశగా కషి చేస్తే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు.ఏసీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ మాట్లాడుతూ మానవత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్ఎంఎంఎస్ శిక్షణా తరగతులకు ఏ.సి కళాశాల వేదిక కావడం ఆనందదాయకమని, విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమంగా రాణించి, స్కాలర్‌షిప్‌లు సాధించాలని ఆకాంక్షించారు.తొలుత క్వాడిస్టర్ సాఫ్ట్వేర్ కంపెనీ వ్యవస్థాపకులు బండి శ్రీహరి మోడల్ పేపర్‌ను ఆవిష్కరించి, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మానవత సభ్యులు కోట శ్రీనివాస్, టీవీ సాయిరాం, వి.బాలకష్ణచౌదరి, చావా లక్ష్మీ సామ్రాజ్యం, పావులూరి చిన్న సుబ్బారావు, కె.అరుణాచలం పాల్గొన్నారు.

ఎపిఎంఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థుల్లో దాగి ఉన్న గణిత సామర్థ్యాలను వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎపిఎంఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.సాంబశివరావు అన్నారు. ఆదివారం గుంటూరులోని ఉర్దూ బాలుర హైస్కూల్లో ఎపిఎంఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎన్.బి.తిలక్, గౌరవ సలహాదారులుగా టి.సాంబశివరావు, అధ్యక్షులుగా ఎస్.వి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా బి.ప్రసాద్, కోశాధికారిగా ఎ.రెహమాన్, ఉపాధ్యక్షులుగా బి.శ్రీనివాసరావు, కె.కామాక్షి, ఎంఎన్ఎ.సిద్దిక్, బలవలింగప్రసాద్, ఎం.శాయన్న, కార్యదర్శులుగా నాంచారయ్య, సునీత రజని, జె.మురళీ మోహన్, ఎం.బాలనాగయ్య నాయక్, షేక్.చాంద్‌భాషా, కె.జయలక్ష్మి తదితరుల్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి టి.సాంబశివరావు వ్యవహరించారు.

నూతన కార్యవర్గం

ధాన్యాన్ని ఆంక్షల్లేకుండా కొనాలి : రైతుసంఘం

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్ : దిత్వా తుపాను ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న రైతుల వద్ద ధాన్యాన్ని ప్రభుత్వం ఎటువంటి ఆంక్షలు లేకుండా, తేమ శాతం పేరుతో జాప్యం చేయకుండా బస్తా రూ.1792కు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుండిమెడ గ్రామంలో కళ్లాల్లో ఆరబోసిన ధాన్యాని రైతుసంఘం నాయకులు ఆదివారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. పలువురు రైతులు దిత్వ తుపాను ప్రభావంతో తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారస్తులకు అమ్ముకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ ఈ ఏడాది కాలంలో అనేకసార్లు అధిక వర్షాలు పడడం వలన రైతాంగం పంటలు నష్టపోయి, తీవ్ర నష్టాలలో కూరుకుపోయారని అన్నారు. ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే, అతి తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 17శాతం తేమ శాతం ఉంటేనే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అప్పటివరకు తాము పండించిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబోసుకుంటూ, తుపాను హెచ్చరిక ప్రభావంతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ప్రైవేటు వ్యాపారస్తులకు 77 కేజీల ధాన్యం బస్తా 1400 నుండి 1300 రూపాయలకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. దీంతో ఒక్కో రైతు ఎకరానికి రూ.10 వేలు చొప్పున నష్టపోయే ప్రమాదం ఉందని చెప్పారు. పరిశీలనలో కౌలురైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పి.కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రుమటాయిడ్ ఆర్థరైటిస్‌ను తొలి దశలోనే గుర్తించాలి

ప్రజాశక్తి-గుంటూరు : రుమటాయిడ్ ఆర్థరైటిస్ వ్యాధి తొలి దశలో గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోకపోతే అది ప్రాణాంతకం అయ్యే అవకాశం ఉంటుందని సీనియర్ రుమటాలజిస్ట్ డాక్టర్ పొన్నూరు దీపిక అన్నారు. ఆదివారం స్థానిక అవగాహనసంస్థ కార్యాలయంలో 'కీళ్ళు, కండరాల నొప్పులు' అనే అంశంపై నిర్వహించిన ఆరోగ్య సభకు అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ దీపిక మాట్లాడుతూ మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తి బయట నుంచి వచ్చే వైరస్‌పై పోరాడి మన ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. అలా కాకుండా, ఒక్కొక్కసారి మనలోని వ్యాధి నిరోధక శక్తి మంచి కణాలను, కణజాలాలు పాడు చేసే విధంగా మార్పు చెందుతుందని దాని వల్ల వచ్చే వ్యాధులను 'ఆటో ఇమ్యూన్ డిసీజ్' అంటారన్నారు. కీళ్లవాతం, రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆస్టియో పోరోసిస్, గౌట్, సోరియాటిక్ ఆర్థరైటిస్, యాంకలోసిస్ ఆర్థరైటిస్, ఐ బిడి ఆర్థరైటిస్‌లు ఇమ్యూన్ వ్యాధుల కిందకు వస్తాయన్నారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్ వ్యాధి ఒక్క కీళ్లకే కాకుండా కళ్ళు, గుండె, ఊపిరితిత్తులు తదితర అన్ని అవయవాలకు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. దీని వల్ల నొప్పి, వాపు, పట్టుకు పోయినట్లుగా ఉండటం, నొప్పి ఎక్కువ సమయం ఉండడం లాంటి లక్షణాలు కనిపించినప్పుడు దానిని ఆర్థరైటిస్‌గా అనుమానించి వెంటనే అందుబాటులో ఉన్న రుమటాలజిస్ట్‌ను సంప్రదించాలని సూచించారు. ఒకసారి రుమటాయిడ్ ఆర్థరైటిస్ బారిన పడినవారు మూడు నెలలకొకసారి రక్త పరీక్షలు చేయించుకుంటూ మందులు వాడుకోవాలన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి

ప్రజాశక్తి తెనాలి : స్థానిక రైల్వే స్టేషన్ శివారు యార్డ్ వద్ద గుర్తుతెలియని మహిళ మతదేహం ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు పరిశీలించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేశారు. మహిళ వయసు సుమారు 60 సంవత్సరాలు ఉండవచ్చునని, గుర్తించిన వారు 98492 34990 నెంబర్లు సంప్రదించాల్సిందిగా ఇంచార్జ్ ఎస్సై పి రమేష్ బాబు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - తెనాలి : అనధికారికంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పాండురంగ పేటలోని ఓ అప్పడాల కంపెనీలో రేషన్ బియ్యం నిల్వ చేశారన్న సమా చారంతో త్రీ టౌన్ పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఏడు క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తెనాలి : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ ఇస్లాంపేటకు చెందిన టి. నాగమల్లేశ్వరరావు శనివారం రాత్రి తెనాలి నుండి చందోలు రహదారి వెంట వాకింగ్‌కు వెళ్లాడు. జగ్గడిగుంటపాలెం వద్ద అమృతలూరుకు చెందిన వ్యక్తి బైక్ వేగాన్ని అదుపు చేయలేక నాగమల్లేశ్వరరావును ఢీ కొట్టాడు. తీవ్రగాయాలపాలైన నాగమల్లేశ్వరరావును 108లో తెనాలి వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు పంపారు. బైక్‌పై ఉన్న వ్యక్తి గాయాలపాలవగా వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. గుంటూరులో చికిత్స పొందుతూ నాగమల్లేశ్వరరావు ఆదివారం మృతి చెందాడు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్ : టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని కంటైనర్ వాహనం ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల భాగ్యనగర్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఈప్రమాదంలో భాగ్యనగర్ కాలానికి చెందిన చల్లంచర్ల ప్రభుదాస్ (35) అక్కడికక్కడే మృతిచెందాడు. కూలి పనులు చేసే ప్రభుదాసు వెన్నాదేవి సమీపంలో ఉన్న పొలంలో నీళ్ళు పెట్టి తిరిగి టివిఎస్ వాహనంపై ఇంటికి వస్తుండగా పిడుగురాళ్ల నుండి సత్తెనపల్లి వస్తున్న కంటైనర్ వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతుడు భార్య కోటేశ్వరమ్మ నిండు గర్భిణి. రూరల్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

IN THE HON'BLE COURT OF THE X ADDL. DISTRICT JUDGE cum M.A.C.T. AT: ANAKAPALLI M.O.P. 141/2023

Between:
Ganisetty Eswara Lakshmi & another ...Petitioners
And
Shaik Nagur Vali & 2 others ...Respondents

NOTICE

To,
R-1: Shaik Nagur Vali,
S/o. Jabbar, Muslim, aged 26 years,
R/at D.No.8-20-28/37, Sitharamanagar,
Guntur Town & District-522001
(Driver of Lorry Reg. No. AP 39 U 5299)
R-2: Yerredla Chandrasekar Reddy,
S/o. Siva Reddy, D.No.4-22-3/1/1,
Chaitanyapuri Main Road, Koritepadu,
Guntur-522007.
(Owner of Lorry Reg. No.AP 39 U 5299)

Please take notice that the above named petitioners filed the above MOP against driver, owner and Insurance Company and claiming compensation of Rs.20,00,000/- (Rupees: Twenty Lakhs only) for death of deceased Ganisetty Bhanu Siva in a motor accident on 20-07-2022 at about 21:00 hrs on NH 16 Road, Anakapalli -Yelamanchili Route, Near Chittinad Cement factory, A.S. Peta Village, Kasimkota Manal, Anakapalli District and the matter coming for your appearance and stands posted to **16-12-2025** on that day your, personally or through Advocate attend before the Hon'ble Court at **10:30 A.M.** failing which the Hon'ble Court is decided under the Court of law.

(By Order of the Hon'ble Court)
K. PRAKASA RAO & M.P. NAIDU
Advocates, Visakhapatnam.
Cell: 8074537294.

ఎన్జీఓస్ అధ్యక్షులుగా బిక్షాలు గెలుపు

కోలాహలంగా ముగిసిన ఎన్నికల ప్రక్రియ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

విజయం సాధించిన బిక్షాలు, సాయి కుమార్, అనిల్ కుమార్

ఎపిఎన్జీవోస్ తెనాలి యూనిట్ నూతన అధ్యక్షులుగా బిసి వెల్ఫేర్ అధికారి బిక్షాలు ఘన విజయం సాధించారు. ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తెనాలి తాలుక యూనిట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. స్థానిక ఎన్జివో కళ్యాణమండపంలో జరిగిన పోలింగ్ ప్రక్రియ ఉదయం 08:00 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 03:00 గంటలతో ముగిసింది. తెనాలి యూనిట్ పరిధిలో మొత్తం 1056 ఓట్లు ఉండగా 874 మంది తమ ఓటు హక్కును వినియోగించు కున్నట్లు ఎన్నికల అధికారి కె.ఎన్ సుకుమార్ తెలిపారు. ఎన్నికల బరిలో రెండు ప్యానల్లు ఉండగా ఒక్కో సమితి నుంచి 16 మంది చొప్పున రెండు ప్యానల్లో 32 మంది అభ్యర్థులు వివిధ హెూదాలలో పోటీ చేసారు. తెనాలి యూనిట్ ప్రెసిడెంట్ అభ్యర్థులుగా మొదటి ప్యానల్లో కె మోహన్ చౌదరి రెండో ప్యానాల్లో వి బిక్షాలు ప్రధానంగా పోటీ చేశారు. పోలింగ్ ప్రక్రియ ముగిసేసరికి మొత్తం 874 పోలైనట్లు అధికారులు తెలిపారు. లెక్కింపు ప్రక్రియలో శనివారం రాత్రి 11:00 గంటలవరకూ లెక్కింపు ప్రక్రియ కొనసాగింది. మొత్తం ఏడు రౌండ్లు ముగిసేసరికి బిక్షాలు 218 ఓట్ల మెజారిటీతో మోహన్ చౌదరిపై గెలుపొందినట్లు అధికారికంగా ప్రకటించారు. కార్యదర్శిగా ఎం

కోలాహలంగా సాగుతున్న ఎన్నికల ప్రక్రియ

సాయి కుమార్, కోశాధికారిగా డి.పి అనిల్ కుమార్ తో సహా ప్యానెల్ లో వున్న 13 మంది సభ్యులు ప్రతిపక్షాలను క్లీన్ స్వీప్ చేశారు. సహచరులు, సచివాలయ ఉద్యోగులు సమష్టిగా తమ ప్యానెల్ సభ్యులందరినీ గెలిపించారని బిక్షాలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కషిచేస్తామని తెనాలి యూనిట్ కోశాధికారి డి.పి అనిల్ కుమార్ తెలిపారు. ఈ ప్యానెల్ మూడేళ్లపాటు కొనసాగుతుందని కార్యదర్శి సాయికుమార్ తెలిపారు. సహాయ ఎన్నికల అధికారి విజయ్ పర్యవేక్షించారు.

నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు సాధించే వరకు ఐక్యంగా పోరాడదాం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఆత్మకూరులో ఇళ్ల స్థలాల అర్జీదారుల సమావేశం కే భువనేశ్వరి అధ్యక్షతన జరిగినది ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ మంగళగిరి రూరల్ గ్రామాల్లో అనేకమంది పేదలు అద్దె ఇళ్లల్లో నివసిస్తూ కూలి పనుల ద్వారా వచ్చిన ఆదాయంలో అద్దెలు కట్టుకోలేక చాలా ఇబ్బందులు పడుతున్నారని వాళ్లకి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారానికి వస్తే ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇళ్లస్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించి ఇస్తామని లోకేష్ బాబు ఎన్నికల వాగ్దానం మేరకు మాట నిలుపుకోవాలని ఇప్పటికే మంగళగిరి నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలు కావాలని కమిషనర్ కు అర్జీలు అందించడం జరిగిందని తక్షణం అర్జీదారులను ఎంక్వైరీ చేసి అర్హుల జాబితాను లోకేష్ దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేదానికి తోడ్పడాలని లేనియెడల ప్రజలను సమీకరించి దశలవారీగా ఇళ్ల స్థలాలు సాధించే వరకు ఆందోళన నిర్వహించాలని కోరారు అనంతరం అర్జీదారులతో ఇళ్ల స్థలాల సాధన కమిటీని ఏడు గురుతో ఏర్పాటు చేయటం జరిగింది. కన్వీనర్ గా గడ్డం అజయ్ కుమార్, కో కన్వీనర్ గా కే భువనేశ్వరి, కమిటీ సభ్యులుగా పులివర్తి రాజమణి, షేక్ ఖాసింబి, దండుగుల వెంగమాంబ, ఉయ్యాల జ్యోతి, గడ్డం దీప్తి, కేసనం మౌనిక నియమితులు అయ్యారు ఈ కార్యక్రమంలో గ్రామ అర్జీదారులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి లాంగ్ సర్వీసుల్లో రాయితీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఎపిఎస్ఆర్టీసి హైదరాబాద్, విశాఖపట్నం బస్సు సర్వీసుల్లో 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెనాలి డిపో ట్రాఫిక్ ఇనస్పెక్టర్ ఐ.జె ప్రసాద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజా రవాణా అధికారి సామ్రాజ్యం ఆదేశాలతో ప్రకటన జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. డిసెంబరు ఒకటి నుంచి 20 వరకు ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. తెనాలి నుంచి బిహెచ్ఈఎల్ కు టికెట్ ధర గతంలో రూ. 770 ఉండగా ప్రస్తుతం రూ. 700 కి తగ్గించగా అలాగే తెనాలి నుండి విశాఖపట్నం టికెట్ ధర రూ. 960 నుంచి రూ. 880 వరకు తగ్గించినట్లు తెలిపారు. రాయితీ ఆదివారం సర్వీసుల్లో వర్తించదన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు.

7న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ప్రజాశక్తి - రెంటచింతల

జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)ను ఈ నెల 7న నిర్వహించనున్నట్లు ఎంఇఒ-1 ఏసుబాబు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని, హాల్‌టిక్కెట్‌లను వెబ్‌సైట్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. వాట్సాప్‌లోని మన మిత్ర యాప్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చున్నారు. హాల్ టిక్కెట్లో వున్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా పరీక్షా కేంద్ర వివరాలను తెలుసుకోవచ్చని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - దుర్గి

స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా వాణి విద్యానికేతన్ స్కూల్‌లో ఎంఇఒలు ఎ.సురేష్, కోటేశ్వరరావు ఆదివారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం నాటిన ప్రతి మొక్కను పరిరక్షించే బాధ్యతను అందరూ తీసుకోవాలని సూచించారు. పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించటానికి మొక్కలు ఒక్కటే పరిష్కారమన్నారు. కార్యక్రమంలో విద్యానికేతన్ ప్రిన్సిపల్ కెవి.రమణ, డైరెక్టర్ అంజనీకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో గురజాడ వర్ధంతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని బీసీ హాస్టల్‌ల్లో జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవల ప్మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో మహాకవి గురజాడ అప్పారావు 110వ వర్ధంతిని నిర్వహించారు. ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పివి.సుబ్బారావు హాజరై గురజాడ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. గురజాడ గేయాలను ఆలపించారు. అనంతరం విద్యార్థులకు కథల పుస్తకాలు అందించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రచురణల విభాగం కన్వీనర్ డాక్టర్ డి.బుజ్జిబాబు, వార్డెన్ కృపావతి, రవికిరణ్ పాల్గొన్నారు.

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండలో అదివారం పర్యాటకుల సందడి నెలకొంది. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు లాంచీలలో వెళ్లిన పర్యాటకులు కొండలోని మ్యూజియంలో ఉన్న బుద్దిని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధ శాల, స్నానాల గట్టు, బోధి వృక్షాన్ని సందర్శించారు. అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపులోని యాంపి స్టేడియం, అశ్వమేధ యగ్నశాల, శ్రీ రంగనాథస్వామి దేవాలయాన్ని తిలకించారు. లాంచీల ద్వారా శని, ఆదివారాల్లో రూ.1.20 లక్షల ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ మేనేజర్ మస్తాన్‌బాబు తెలిపారు.

ఆద్యంతం... అద్భుతం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

చిన్నారులు కోల్పోతున్న సృజనాత్మకత, నైపుణ్యాలు, అంతరించి పోతున్న దేశ సంస్కృతి సంప్రదాయాలు, అభ్యుదయ భావాలు రేకెత్తించేందుకు వేలాది మంది చిన్నారులను ఒక చోటకు చేర్చి వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలుగులోకి తీసుకువస్తున్న పల్నాడు బాలోత్సవం కమిటీ సభ్యులకు పట్టణ ప్రముఖులు కొనియాడారు. రెండురోజుల పాటు జరిగిన పల్నాడు బాలల పండుగ బాలోత్సం ఆద్యంతం అద్భుంగా జరిగింది. చిన్నారులు జానపద వేషధారణలతో మైమరిపించారు. బాలల ప్రపంచం నరసరావుపేటలోనే ఉందా అనిపించేలా అధిక సంఖ్యలో ఉరిమే ఉత్సాహంతో ఆకాశమే హద్దుగా ఆయా సాంస్కఅతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణం మొత్తం ఎటు చూసినా బాలల కేరింతలు, చిన్నారుల నవ్వులే కనిపించాయి.

- ఔరా ! అనిపించిన పల్నాడు బాలోత్సవం 3వ పిల్లల పండుగ...
- అబ్బురపరచిన సాంస్కృతిక పోటీలు...
- దేశభక్తి, జానపద గీతాల పాటలు, కోలాటంతో కదం తొక్కిన చిన్నారులు
- బాలోత్సవాల కమిటీ సభ్యుల కృషిని కొనియాడుతున్న పట్టణ ప్రముఖులు

పల్నాడు బాలోత్సవం రెండో రోజు ఆదివారం చిన్నారులతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో ఎస్.ఎస్.ఎన్ కళాశాల ప్రాంగణం కితకితలాడింది. బాలోత్సవం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రదర్శనకు వచ్చిన చిన్నారులకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిధులుగా హాజరైన ఎంఎఎం కళాశాలల చైర్మన్ మేధరమెట్ల రామశేషగిరిరావు, ఎస్.ఎస్.ఎన్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయ్ కుమార్, లిఖిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ రామినేని వినోద్ కుమార్ రెడ్డి తదితరులు హాజరై చిన్నారుల ప్రదర్శనలు తిలకించి సంతోషం వ్యక్తం చేశారు. 13 వేల మందికి పైగా చిన్నారులు పాల్గొని కోలాటం, లఘు నాటికలు, జానపద నఅత్యం-గ్రూపు, పాటలు,స్పెల్ బి, ప్రాజెక్ట్ పని, రంగ వల్లులు, బుర్రకథ, కథ చెప్పడం, తెలుగు పద్యాలు/అభినయ గేయాలు,దేశ భక్తి గేయాలు, రైమ్స్, విచిత్ర వేషధారణ, మెమొరీ టెస్ట్, బెస్ట్ ఫ్రమ్ వేస్ట్, వక్తృత్వం, మ్యాథ్స్ క్విజ్, మట్టితో బొమ్మలు వంటి తదితర పోటీలలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శాస్త్రీయ నృత్య భంగిమలతో ఔరా అనిపించారు. నాటికలు, పాటలు, పద్యాలు ఏక పాత్రాభినయాలలో పెద్దలకు సైతం పోటీ వచ్చేలా ప్రతిభ కనబరిచారు.మునుపెన్నడూ లేని రీతిలో వారిలోని ప్రతిభను చాటి చెప్పారు.

బాలోత్సవంలో 3 వేల మొక్కలు పంపిణీ...

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు బాలోత్సవాలకు తరలివచ్చిన చిన్నారులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రు లకు నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నెల్లూరి రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలన్నారు. కలప జాతి, నీడ జాతి, పండ్లు, పూల జాతి మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న గ్రామాలలో కూడా సామాజిక బాధ్యతతో ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తున్నా మన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇంటి వద్ద స్కూల్ నందు చిన్నారులచే మొక్కలు నాటించి సంరక్షించే బాధ్యత అప్పగించాలన్నారు.

మొక్కలు పంపిణీ చేస్తున్న డాక్టర్ నెల్లూరి రమేష్...

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను సత్తెనపల్లి డిఎస్‌పి ఎం.హనుమంతరావు హెచ్చరించారు. సబ్ డివిజన్ పరిధిలోని 102 మంది రౌడీషీటర్లకు సత్తెనపల్లిలోని డిఎస్పీ కార్యాలయంలో ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. డిఎస్పీ మాట్లాడుతూ నేరాలకు పాల్పడిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నేర ప్రవృత్తిని విడనాడాలని రౌడీషీటర్లను టూటౌన్ పోలీసులు హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, నేర చరిత్ర గల వారికి ఆదివారం ఇచ్చిన కౌన్సెలింగ్‌లో పోలీసులు మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవన్నారు. రౌడీ షీట్లు కలిగిన

వ్యక్తుల ప్రవర్తన, వారి జీవన విధానంపై నిఘా ఉంటుందని, సత్‌ప్రవర్తనతో మెలిగి ప్రశాంతంగా జీవించాలని సూచించారు. ఇదిలా ఉండగా పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

మురిసిన మంగళాద్రి

అదిరిన బాలల పండుగ.. ఉత్సాహంగా రెండో రోజు మంగళగిరిలో బాలల దినోత్సవం..

ప్రజాశక్తి - మంగళగిరి

బాల బాలికల విచిత్ర వేషధారణలు, ఔరా అనిపించేలా నాట్యవిన్యాసాలు, గళమెత్తిన ఏకపాత్రాభినయం, కళ్లకు కట్టిన నాటికలు, ప్రాణంపోసేలా కళాకృతులతో మంగళాద్రి మురిసిపోయింది. మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం మూడవ పిల్లల పండగ పట్టణంలోని అరవింద మోడల్ స్కూల్లో ఆదివారమైన రెండో రోజు అదిరిపోయింది. క్విజ్, స్వచ్ఛ తెలుగు, తెలుగులో ఉపన్యాసం, మట్టితో బొమ్మలు, ఇంగ్లీషులో ఉపన్యాసం, జానపద, శాస్త్రీయ నృత్యాలు, లఘు నాటికలు, ఏకపాత్రాభినయం, దేశభక్తి గీతాలు, కోలాటం రెండో రోజు జరిగాయి. వివిధ పాఠశాల నుండి పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. వారితోపాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు. బాలల ప్రదర్శిస్తున్న ప్రతి ఈవెంట్ను ఆదరించారు. ఏకపత్రాభినయంలో బాలలు అనేక దేశభక్తి సంబంధించిన విప్లవకారుల సంబంధించిన పాత్రలను అద్భుతంగా ప్రదర్శించారు. కోలాటాలు నృత్యాలు ప్రదర్శించారు. నిడమర్ రోడ్డు అంతా కోలాహాలంగా మారింది. ఎటు చూసినా బాలలు వివిధ వేషధారణలో కనిపించారు. ఈ కార్యక్రమాన్ని అమరావతి బాలోత్సవం రాష్ట్ర కన్వీనర్ పి.మురళీకృష్ణ, రాష్ట్ర బాధ్యులు పి.ఐజాక్ న్యూటన్, మంగళగిరి,తాడేపల్లి బాలోత్సవం మూడో పిల్లల పండగ గౌరవాధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరావు, అధ్యక్షులు వి.వి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్జశాంతి రెడ్డి, కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, కార్యదర్శులు పి.రాజశేఖర్, షేక్ బాజీ సైదా, సిహెచ్.వి.రాధాకృష్ణ, సింహాద్రి సుమ, గౌరవ సలహాదారులు వల్లభనేని వాణి, వి.వెంకటేశ్వరరావు, రిటైర్డ్ టీచర్ ఎస్.బాలకృష్ణ, ఉపాధ్యక్షులు ఎం.విజయ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేస్తున్న బాలోత్సవ కమిటీ సభ్యులు

బాలోత్సవ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేత

- వాలంటీర్లకు ప్రశంసా పత్రాలు పంపిణీ
- పాల్గన్న పాఠశాలల అన్నిటికీ జ్ఞాపికలు అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి, తాడేపల్లి బాలోత్సవం మూడో పిల్లల పండగ రెండు రోజులపాటు మంగళగిరి పట్టణంలోని అరవింద మోడల్ స్కూల్లో జరిగాయి. బాలోత్సవ పోటీలలో పలు వీవెంట్లలో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేశారు. క్విజ్, స్వచ్ఛ తెలుగు, తెలుగులో ఉపన్యాసం, మట్టితో బొమ్మలు, ఇంగ్లీషులో ఉపన్యాసం, జానపద నఅత్యాలు, శాస్త్రీయ నృత్యాలు, లఘు నాటిక, ఏకపాత్రాభినయం, దేశభక్తి గీతాలు, కోలాటం తదితర పోటీలలో రెండు రోజులు పాటు జరిగిన వాటిల్లో 3,000 మంది విద్యార్థినీ, విద్యార్థులు, 66 పాఠశాల నుండి పాల్గొన్నారు. ఈ పోటీలలో బాలలు సృజనాత్మకతను, టాలెంటును ప్రదర్శించారు. రెండు రోజులపాటు జరిగిన బాలోత్సవం కార్యక్రమంలో వాలంటీర్లుగా పనిచేసిన నిర్మల జూనియర్ కళాశాల, నలంద ఒకేషనల్ జూనియర్ కళాశాల, వీజె డిగ్రీ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పనిచేశారు. వీరందరికీ ప్రశంసా పత్రాలను అందజేశారు. అదేవిధంగా 66 పాఠశాలల జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అమరావతి బాలోత్సవ కన్వీనర్ పి.మురళీకృష్ణ, అమరావతి బాలోత్సవ బాధ్యులు బాధ్యులు ఐజాక్ న్యూటన్, పి.విజయ, జిఎల్ నరసింహారావు, తాడేపల్లి బాలోత్సవం మూడో పిల్లల పండగ కమిటీ గౌరవాధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, అధ్యక్షులు వివి ప్రసాద్, కార్యదర్శి పి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఆర్.శాంతిరెడ్డి, కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, మంగళగిరి తాడేపల్లి బాలోత్సవ మూడవ పండుగ కమిటీ కార్యదర్శి షేక్ బాజీ సైదా, సింహాద్రి సుమ, ఐ వెంకటేష్, ఎస్ బాలకఅష్ణ, సిహెచ్ అరవింద్, ఉపాధ్యక్షులు ఎం.విజయ మోహన్ రావు, గౌరవ సలహాదారులు వల్లభనేని వాణి, రోటరీ క్లబ్ మంగళగిరి మాజీ అధ్యక్ష కార్యదర్శులు గాజుల శ్రీనివాసరావు, అందే మురళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రభుత్వమే మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెదకాకాని

మద్దతు ధరకు వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి సిపిఎం మండల కమిటీ సభ్యులు రాజా రమేష్ అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ప్రారంభమయ్యాయని, ఒకవైపు తుపాను హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 75 కేజీల వరి ధాన్యం బస్తాను 1792 రూపాయలకు నిర్ణయించగా ప్రైవేటు వ్యాపారులు 12 వందల నుండి 13 వందల రూపాయలకు కొనుగోలు చేస్తున్నారని బస్తాకు 500 రూపాయల నష్టాన్ని చవిచూస్తున్నారని తెలిపారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, ఉల్లంగుల శివయ్య, సాంబయ్య, సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

హత్యలతో ఉద్యమాలను ఆపలేరు

ప్రజాశక్తి - దుగ్గిరాల

హత్యలతో ఉద్యమాలను ఆపలేరని, ప్రజలను చైతన్య పరచటం కళాకారుడు చేసిన తప్పా అని వివిధ ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మండల కేంద్రం దుగ్గిరాలలోని శివాలయం సెంటర్ వద్ద ఆదివారం ఇటీవల నెల్లూరు జిల్లాలో హత్యకు గురైన ప్రజా నాట్యమండలి కళాకారుడు కె.పెంచలయ్య హత్యను తీవ్రంగా ఖండించారు. ఉద్యమ నాయకుడిని హత్య చేయటం క్షమించరాని నేరమని హత్యకు పాటుపడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, వై.కమలాకర్‌రావు, ఎన్.యోగేశ్వర రావు, జి.శ్రీనివాసరావు, బి.చిరంజీవి, ఎం.సుబ్బారావు, వి.జగన్మోహన్రావు, పి.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాడికొండలో నిరసన..

ప్రజాశక్తి - తాడికొండ

నెల్లూరులో గత శుక్రవారం గంజాయి ముఠా చేతిలో దారుణంగా హత్యకు గురైన ప్రజా కళాకారుడు కె పంచలయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని రైతు సంఘం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు డిమాండ్ చేశారు. ఆదివారం తాడికొండలోని బస్టాండ్ వద్ద ఈ మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం మతపదార్థాలపై పెంచలయ్య ఎన్నో పాటలు రచించి పాడి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు అటువంటి వ్యక్తిని కక్షగట్టి దారుణంగా హత్య చేయడం దారుణమని అన్నారు పెంచలయ్య హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించి అయన కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బాణావత్ భద్రయ్య, జోషి, సుభాని, నాగేశ్వరరావు, తిరుపతమ్మ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టిని తరలిస్తున్న లారీలు స్వాధీనం

ప్రజాశక్తి - నకరికల్లు

మట్టిని అక్రమంగా తరలిస్తున్న 2 లారీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని జిల్లాపేటతండా నుంచి మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఆదివారం ఉదయం చేజర్ల, కుంకలగుంట గ్రామాల మధ్యలో రెండు లారీలను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా నర్సింగపాడు, నకరికల్లు, గుండ్లపల్లి, చల్లగుండ్ల గ్రామాల్లో అక్రమ మైనింగ్ జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం పట్టుకున్న లారీలను కూడా లావాదేవీల్లో విభేదాల వల్ల పట్టుకున్నవేనని అంటున్నారు.

నిధుల కోసం మంత్రికి ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బీపీఎస్ఎల్ఆర్ఎస్ పథకం కింద నరసరావుపేట మున్సిపాలిటీలో కీలక అభివృద్ధి పనులకు నిధుల మంజూరు చేయాలని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణను ఎమ్మెల్యే డాక్టర్ చడలవాడ అరవిందబాబు కోరారు. ఈ మేరకు మంత్రిని క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిపి వినతి పత్రం అందజేశారు. నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలో రహదారుల అభివృద్ధి, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సరఫరా విస్తరణతో పాటు ఇతర ప్రజా సదుపాయాల అభివృద్ధికి పనులను ప్రతిపాదించారు. పేదలు నివాసం ఉండే ప్రాంతాలు, వనరులు తక్కువగా ఉన్న కాలనీలు, ఇప్పటి వరకు అభివృద్ధికి నోచని ప్రాంతాల్లో మౌళిక సదుపాయాల కల్పనపై మంత్రికి వివరించారు.

నరసరావుపేటలో విజయనిర్మల విగ్రహ ఏర్పాటుకు కృషి : నటుడు నరేష్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

న్యూ మాంగ్స్ కుంగ్‌ఫూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సర్టిఫికెట్ కోర్స్ అవార్డ్స్, బ్లాక్ బెల్ట్ అవార్డుల ప్రదానోత్సవానికి నరసరావుపేటకు వచ్చిన సినీ నటుడు నరేష్‌ను టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ - మహేష్‌బాబు యువశక్తి పట్టణ అధ్యక్షులు ఎమ్‌డి.ఫారూఖ్‌బాబు కలిసి సత్కరించారు. నరేష్ మాట్లాడుతూ నరసరావుపేట వాస్తవ్యురాలైన తన తల్లి విజయనిర్మల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసే విషయమై వారితో మాట్లాడారు. విజయ నిర్మల విగ్రహంతో పాటు సూపర్ స్టార్ కృష్ణ విగ్రహాన్ని ఏర్పాటుకు సహకరించాలని ఫారూఖ్ బాబు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పి.వెంకటరావు షేక్.నబీబాజీ, డి.నాగేశ్వరరావు, బి.మస్తాన్‌రావు, ఎమ్‌డి.అమీర్, ఎస్.థామస్, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గంజాయి తయారీకి వాడే ఆయిల్ స్వాధీనం

ప్రజాశక్తి - మాచర్ల

గంజాయి తయారు చేసే హాశిష్ ఆయిల్ 494 గ్రాములు స్వాధీనం చేసుకొని, ఐదుగుర్ని అరెస్టు చేసినట్లు గురజాల డిఎస్పీ జగదీష్ తెలిపారు. స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వెల్దుర్తి ఇన్‌ఛార్జి ఎస్ఐ డి.అశోక్‌కు వచ్చిన సమాచారం మేరకు మండాది గ్రామ శివారులో ఉన్న కానవాగు వద్దకు వెళ్లగా ఐదుగురు వ్యక్తులు పోలీసు వాహనం చూసి పారిపోవటానికి ప్రయత్నించారని, వారిని వెంబడించి రమణి అరవింద్, షేక్ నాగుల్ షరీఫ్, షేక్ నజీర్, పటాన్ సిరాజ్ ఖాన్, షేక్ సలీంను పట్టుకుని విచారణ చేశామని చెప్పారు. వ్యసనాలకు అలవాటుపడి వాటి కోసం డబ్బులు సంపాదన కోసం ఈ మార్గాన్ని వారు ఎంచుకున్నట్లు తేలిందన్నారు. ఒడిశా సమీపంలోని చిత్రకొండ పరిసరాలలో గంజాయితో తయారు చేసే హాశిష్ ఆయిల్ బాటిల్స్‌ను తెచ్చి మాచర్ల పరిసర ప్రాంతాల్లో కాలేజీ విద్యార్థులకు అమ్ముతున్నట్లు అంగీకరించారని, వీరిని కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు. సమావేశంలో రూరల్ సిఐ, ఎస్సై అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ జగదీష్.. వెనుక ముసుగుల్లో నిందితులు

డ్రగ్స్ కంటే హీరో ఆరాధన ప్రమాదకరం

నియంత్రించాలని రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు

లేఖలు చూపుతున్న భానుప్రసాద్ తదితరులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఆరాధన భవిష్యత్‌కు నష్టమని, హీరో అనే పదం డ్రగ్ కంటే ప్ర మాదకరంగా మారిన ఈ అంశంపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాసినట్లు సామాజికవేత్త మాదాసు భానుప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సినిమాలో నటించే వారిని లీడ్ యాక్టర్, లీడ్ యాక్ట్రెస్ అని కాకుండా హీరో అనే పదం వాడటం వలన విద్యార్థుల మానసిక స్థితిపై తీవ్రమైన ప్రభావం చూపుతోందని, విద్యార్థులు, యువత సమయాన్ని, భవిష్యత్‌ను పాడు చేసుకుంటున్నారని అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించే సైనికుల కంటే, దేశానికి అన్నం పెట్టే రైతన్నల కంటే, తల్లిదండ్రుల కంటే సినీ నటులను గొప్పగా చూస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. అధిక రెమ్యూనిరేషన్ కారణంగా పెరుగుతున్న సినిమా ఖర్చు భారాన్ని ప్రేక్షకులపై వేస్తున్న కారణంగా వాటిని భరించలేని సగటు ప్రేక్షకులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారని చెప్పారు. రెమ్యూనరేషన్ విషయంలో ప్రభుత్వాలు విధివిధానాలు రూపొందించి అమలు చేయాలని కోరారు. స్టార్ అనే పదాన్ని మీడియాలో నియంత్రించాలన్నారు. థియేటర్లలో తినుబండారాలను ఎంఆర్‌పి ధరలకు అమ్మేలా చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్‌కు రుసుం వసూలు చేయరాదని అన్నారు. కార్యక్రమంలో హరిప్రసాద్, ఎం.వెంకట్రావు, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎ.రవి పాల్గొన్నారు.

డాక్టర్ జున్ను సాహెబ్‌కు జాతీయ 'ఉపాధ్యాయ ప్రేరణ అవార్డు'

ప్రజాశక్తి - యడ్లపాడు : మండలంలోని కొండవీడు జెడ్‌పి పాఠశాల ఉపాధ్యాయులు డాక్టర్ జున్ను సాహెబ్ విద్యారంగానికి చేసిన విశిష్ట సేవకు గుర్తింపుగా హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియంలో శారదా ఎడ్యుకేషన్ సొసైటీ అందించే జాతీయ ఉపాధ్యాయ స్ఫూర్తి అవార్డ్స్-2025ను ప్రదానం చేశారు. విద్యార్థులకు వినూత్న బోధన, చేతిరాత నైపుణ్యాల పెంపు, సామాజిక సేవ, 'గ్రీన్ వారియర్స్' సంస్థ ద్వారా పర్యావరణ పరిరక్షణలో చేస్తున్న కృషికిగాను అవార్డును అందుకున్నారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ కుమార్, సొసైటీ వ్యవస్థాపకులు కమలా మనోహర్ అవార్డును ప్రదానం చేసి సత్కరించారు.

మాచర్లలో టెస్ట్ ట్యూబ్ బేబీ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని రవితేజ మల్టీస్పెషాలిటీ హాస్పటల్ నందు ఐవిఎఫ్ టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌ను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదివారం ప్రారంభించారు. వైద్య సేవలు అతి తక్కువ ఉన్న మాచర్ల పట్టణంలో రవితేజ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ స్థాపించి, అన్ని రకాల వైద్య సేవలు అందిస్తూ ప్రజలలో మంచి పేరు గడిస్తూ, తొలిసారిగా టెస్ట్ ట్యూబ్ బేబీ కేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. సంతానం కలగని దంపతులు ఎక్కడికో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి మహా నగరాలకు వెళ్లి రూ.లక్షల ఫీజులు చెల్లించి వైద్యం చేసుకునేవారని, సంతానం లేని దంపతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఐవిఎఫ్ డాక్టర్ గోనుగుంట్ల సుష్మ మాట్లాడుతూ టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ ప్రారంభించిన రోజే దాదాపు సంతానం లేని 54 జంటలు రవితేజ హాస్పిటల్‌కు వచ్చారని, వారికి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వై.మల్లికార్జున్‌రావు, మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్, నాయకులు కె.దుర్గారావు, కె.శివారెడ్డి, ఎం.పెద్ద వెంకటరామిరెడ్డి, చిన్న వెంకటరామిరెడ్డి, పి.పుల్లయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ పి.నరసింహారావు, వై.కేశవరెడ్డి పాల్గొన్నారు.

టెస్ట్ ట్యూబ్ బేబీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వైసిపి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నరసరావుపేట పట్టణం 24 వ వార్డులో ఆదివారం సంతకాలు సేకరించారు. వైసిపి పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు.

అంతర్ కళాశాల బాస్కెట్ బాల్ విజేతగా ధనలక్ష్మి వ్యాయామ కళాశాల

ప్రజాశక్తి-ఈపూరు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 28, 29వ తేదీల్లో నిర్వహించిన అంతర కళాశాలల మహిళల బాస్కెట్ బాల్ పోటీలో మండలంలోని ఎ.ముప్పాళ్లలోని ధనలక్ష్మి వ్యాయామ కళాశాల జట్టు విజేతగా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చుండు వెంకటరావు ఆదివారం తెలిపారు. ఈ పోటీల్లో ఏడు కళాశాలల జట్లు పాల్గొనగా నరసరావుపేట వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు రన్నర్స్‌గా, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు తృతీయ స్థానం, ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల గుంటూరు జట్టు నాలుగో స్థానంలో నిలిచినట్లు చెప్పారు. విజేతలుగా నిలిచిన జట్లను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరిరావు, యూనివర్సిటీ పరిశీలకులు డాక్టర్ డి.సూర్యనారాయణ పీడీలు డాక్టర్ ఎ.ప్రీతం ప్రకాష్, వి.ఏడుకొండలు అభినందించారు.

'మూవీ డేట్' థియేటర్ ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన మూవీడేట్ ప్రైవేటు థియేటర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ప్రైవేట్ థియేటర్‌ల పెరుగుదలతో సినిమా ప్రేక్షకులకు ఇంటి సమీపంలోనే ఆధునిక సౌకర్యాలతో కూడిన స్క్రీనింగ్ అందుబాటులోకి వస్తున్నాయన్నారు. 'మూవీ డేట్' థియేటర్ డిజిటల్ స్క్రీన్, కంఫర్టబుల్ సీటింగ్‌లు, సౌండ్ సిస్టమ్‌లతో సిద్ధమైందన్నారు. నియోజకవర్గంలో యువత అభివృద్ధికి, స్థానిక వ్యాపారాల ప్రోత్సాహానికి ఇలాంటి కొత్త ప్రాజెక్టులు కీలకమన్నారు.

గుంటూరు జిల్లా

సోమవారం 1 డిసెంబర్ 2025

మాట్లాడుతున్న నాయకులు

4న ఎసిసి సిమెంట్ కంపెనీ కార్మికుల రాస్తారోకో

ప్రజాశక్తి- తాడేపల్లి

ఎసిసి సిమెంట్ కంపెనీ కార్మికులు తమకు రావాల్సిన నష్టపరిహారం కోసం చేస్తున్న నిరాహార దీక్షలు డిసెంబర్ 4వ తేదీ గురువారం నాటికి 365వ రోజుకి చేరనుంది. దీక్షలు చేపట్టి సంవత్సరం అవుతోందని, ప్రభుత్వం స్పందించాలని కోరుతూ కార్మికులు అందరూ కలిసి, అఖిలపక్ష ట్రేడ్ యూనియన్, ప్రజా సంఘాల సహకారంతో, ప్రకాష్ నగర్ మెయిన్ రోడ్డులో రాస్తారోకో నిర్వహించాలని కేసీ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ పోరాట కమిటీ నిర్ణయించింది. ఈ సందర్భంగ ఆదివారం బ్రహ్మానందపురంలోని యూనియన్ ఆఫీసు ఆవరణలో సీఐటీయూ, ఏఐటియుసి, వైఎస్సార్సీపీ, ఏఐఎఫ్‌టియు, ఐఎఫ్‌టియు, ఐఎన్‌టిసి కార్మిక సంఘాల నాయకులు సమావేశమై నిర్ణయం తీసుకున్నారు. ఎసిసి కార్మికులు చేస్తున్న పోరాటానికి అన్ని కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, వైఎస్ఆర్‌టియు నాయకులు శ్రీనివాసరాజు, నాయకులు ఆదినారాయణ, ఐఎన్‌టియుసి నాయకులు సామేలు, ఐఎఫ్‌టియు నాయకులు మాట్లాడారు. సమావేశంలో బి.అంకయ్య,సూర్య ప్రకాష్, పిచ్చయ్య, ఆశీర్వాదం, ఇశ్రాయేలు, గురవయ్య, నాగేశ్వరరావు, అక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

362వ రోజుకు చేరిన దీక్షలు

న్యాయంగా తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 362వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను కార్మిక నాయకుడు కూరపాటి స్టీవెన్, బూరగ అంకయ్య, తుపాకుల నాగేశ్వరావు, ముసలా సాంబశివరావు ప్రారంభించారు. దీక్షల్లో ఏనుగుల సాంబశివరావు, బి.సూర్యప్రకాష్, అల్లం విజయశ్రీ, బొందలపాటి నవనీతమ్మ, గొర్రెముచ్చు అన్నమ్మ కుర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల దీక్షలు ప్రారంభించి సంవత్సరం అవుతున్న సందర్భంగా అయినా ప్రభుత్వం ఆలోచించి స్పందించాలని కోరారు. కార్యక్రమంలో దామవరపు నాగేశ్వరావు, దర్శి. మాణిక్యారావు, షేక్ బాషా, అసిఫ్, వై.రమాదేవి, దుర్గాభవాని పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేస్తున్న శంకరరావు

నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలంలోని వెంకటపాలెం వద్ద ఉన్న చిగురు ఆశ్రమంలో అనాధలకు తుళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు అధ్యక్షునిగా పనిచేసిన జొన్నలగడ్డ శంకరరావు నిత్యావసర సరుకులు అందజేశారు. ఆదివారం తన మనవడు జొన్నలగడ్డ జ్ఞాన అగస్త్య పుట్టినరోజును పురస్కరించుకుని కొడుకు సందీప్, ఝాన్సీలతో కలిసి ఆశ్రమంకు వెళ్లి రూ. 15 వేలతో బియ్యం, నూనె, పప్పు, బిస్కెట్లు అందజేశారు. తన మనవడి పుట్టినరోజున అనాధ పిల్లల ఆకలి తీర్చాలన్న ఉద్దేశ్యంతో నిత్యావసర సరుకులు అందజేసినట్లు తెలిపారు. శిబిరం నిర్వాహకులు రాఘవ సూచన మేరకు మంగళవారం పిల్లలను క్షౌరశాలకు తీసుకువెళ్లి క్రాఫ్ చేయించనున్నట్లు శంకరరావు తెలిపారు.

పంట వ్యర్థాలను తగలపెట్టొద్దు : ఏడీఏ

ప్రజాశక్తి - పొన్నూరు

మండల పరిధిలో కొందరు రైతులు తమ పంట పొలాల్లో వ్యర్థాలను తగలపెడుతున్నారని, ఇలా తగలబెట్టడంతో వాయు కాలుష్యంతో పాటు స్థానికంగా ఉండే ప్రజలకు, జి బి సి ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనదారులకు పొగ ఇబ్బందిగా మారిందని, రైతులు వ్యవసాయ వ్యర్థాలను తగలపెట్టొద్దని ఏడిఏ వి.రామకోటేశ్వరి తెలిపారు. సబ్ డివిజన్ ఏ డి ఏ వి.రామకోటేశ్వరి, ఏవో ఆర్. వెంకటేశ్వరరావు సూచించారు. రోటవేటర్ తో భూమిలోకి కలియ పెడితే భూసారం పెరిగి అధిక దిగుబడి వస్తుందన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చేంతవరకు పోరాటం

ప్రజాశక్తి - మంగళగిరి

సమావేశంలో మాట్లాడుతున్న జె.వి.రాఘవులు

ఇళ్ల స్థలం లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం చేస్తామని సిపిఎం సీనియర్ నాయకులు జె.వి.రాఘవులు అన్నారు. మంగళగిరి పట్నంలోని 27, 29 వార్డులకు సంబంధించిన ఇళ్ల స్థలాల సాధన కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో రాఘవులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మంత్రి నారా లోకేష్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించా లని కోరారు. శిలాఫలకం వేయడం జరిగిందని అన్నారు. ఇళ్ల స్థలాల అర్జీలు ఇటీవల పెట్టుకున్నారని తెలిపారు. అర్జీలకు సంబంధించిన రసీదులను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు ఎస్.ఎస్. చెంగయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ, పట్టణ నాయకులు టి.శ్రీరాములు, ఎం.రాం బాబు పాల్గొన్నారు. అనంతరం కమిటీని వేయడం జరిగింది. కన్వీనర్‌గా టి.శ్రీరాములను ఎన్నుకున్నారు.

రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ముందుంటుంది

మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - కొల్లిపర

రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ముందు ఉంటుందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం కొలిపర మండలంలోని అత్తోట శివలూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు భరోసాని ఇచ్చారు. దళారులు మాటలు నమ్మి ఏ ఒక్క రైతు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవద్దని ధాన్యాన్ని ఎగుమతి చేసేందుకు తెనాలి నుంచి ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రైతులను ఆదుకునేందుకు పౌరసరఫరాల శాఖ వ్యవసాయ శాఖ రెవిన్యూ శాఖ కషి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్ శ్రీనివాస్ రెడ్డి, తహశీల్దార్ సిద్దార్థ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- తాడేపల్లి

అనారోగ్యంతో బాధపడుతున్న పెనుమాక గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త అద్దంకి నాగభూషణం కుటుంబానికి ఆదివారం పెనుమాక ప్రాథమిక సహకార సంఘం సొసైటీ అధ్యక్షులు కళ్ళం శివగోవిందరెడ్డి 10వేలు ఆర్థిక సాయం అందచేశారు. నియోజకవర్గ టీడీపీ నాయకులు కొల్లి సురేష్, నెలకి సరిపడ నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా గుంటూరు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు గురజాల నియోజకవర్గ పరిశీలకులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సేవకు పార్టీలు ఉండవని చెప్పారు. ఈ

కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జాన్ ప్రకాష్, తాడేపల్లి మండల టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు బొబ్బ రవితేజ, తాడేపల్లి మండల మాజీ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కళ్ళం చెత్తన్ రెడ్డి, అత్తోట రాంబాబు, మల్లవరపు మస్తాన్ రావు, ఫటాన్ అక్బర్ ఖాన్ పాల్గొన్నారు.

బురాన్‌కు జాతీయ ఉపాధ్యాయ ప్రేరణ అవార్డు

అవార్డు అందుకుంటున్న బురాన్

ప్రజాశక్తి- తాడేపల్లి

శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఇటీవల హైదరాబాదులోని బిర్లా ప్లానిటోరియంలో నిర్వహించిన జాతీయ ఉపాధ్యాయ ప్రేరణ అవార్డు (2025) ను, తాడేపల్లి పట్టణంలోని బ్రహ్మానందపురం పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు ముజార్ బురాన్ అందుకున్నారు. ఈ అవార్డును హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సభ్యులు దాసోజు శ్రావణ్ కుమార్ , శారద ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు కమలా మానోహర్ ల చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శారద ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు కమల మనోహర్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో అనిర్వచనీయమైన సేవ, విద్యార్థులకు వినూత్న బోధనా విధానాలు, అలాగే విద్యార్థుల్లో శ్రద్ధ, చేతిరాత నైపుణ్యాల పెంపొందనపై చూపుతున్న నిరంతర కృషి కారణంగా ఈ జాతీయ అవార్డును ముజార్ బురాన్‌కు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

వాకింగ్‌తోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే క్రమం తప్పకుండా వాకింగ్ చేయటాన్ని విధిగా అలవాటు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ది మంగళగిరి ఎకో పార్క్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎకో పార్క్‌లో ఆదివారం వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆలేటి పూర్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వాకర్స్ సౌకర్యార్థం కావాల్సిన అవసరాలను ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి వాటిని తీర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు గంజి చిరంజీవి మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చక్కటి వాతావరణంలో వన సమారాధన నిర్వహించుకోవడం సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. ది మంగళగిరి వాకర్స్ వెల్ఫేర్

చిల్లపల్లిని సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ నేతలు

అసోసియేషన్ అధ్యక్షులు అవ్వారు కష్ణారావు, ప్రధాన కార్యదర్శి శంకర్ రెడ్డిలు మాట్లాడుతూ 1994లో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేయబడిందని తెలిపారు. అనంతరం నేచర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలోనూ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ ఎంఎస్ఐడిసి చైర్మన్ చిలపల్లి శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ది మంగళగిరి ఎకో పార్క్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులుగా ఉప్పు శివాజీ ని ఎన్ను కున్నారు. ఉపాధ్యక్షులు చంద్రకవి దుర్గారావు, సహాయ కార్య దర్శులు జంజనం వెంకట సాంబశివరావు (జె ఎస్ ఆర్), బాణాల నాగేశ్వరరావు, కోశాధికారి నేరెళ్ల లక్ష్మణరావు, జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మంగళగిరి

పి.ఆరుణ్‌కుమార్

మంగళగిరి పట్టణంలో గల స్కూల్లో మంగళగిరి మండల యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో మంగళూరు మండల యుటీఎఫ్ అధ్యక్షులుగా పి.అరుణ్ కుమార్, కార్యదర్శిగా సిహెచ్.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా, రాష్ట్ర నాయకులు ఎన్ కుమార్ రాజా, యు.రాజశేఖర్, ఎం.కళాధర్, టి. ఆంజనేయులు పాల్గొన్నారు.

తెనాలిలో క్రికెట్ సందడి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఇంటర్ కాలేజీ క్రికెట్ టోర్నీ తెనాలిలో అట్టహాసంగా ప్రారంభమైంది. యువ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక చెంచుపేటలోని ఆర్.పిఎం. క్లబ్ మైదానంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ టిడిపి తెలుగు యువత అధ్యక్షులు కోగంటి రోహిత్ ముఖ్యఅతిథిగా పాల్గని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు. క్రికెట్ టోర్నమెంటుల ద్వారా యువతను ప్రోత్సహిస్తున్న కోచ్ మాలిక్‌ను అభినందించారు.

దేవాదాయ భూముల రికార్డులు సరి చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి

దేవాదాయ, ధర్మాదాయ శాఖ సంబంధించిన గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని దేవాదాయ భూములుకు రెవెన్యూ రికార్డులపై ఆదివారం మంగళగిరి టిటిడి కళ్యాణ మండపంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దేవుని మన్యాల 1ఎ, అడంగల్, ఆర్.ఎస్.ఆర్. ప్రకారం సరి పోల్చి రికార్డులు కచ్చితంగా ఉండేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలని దేవాదయా శాఖ ప్రాంతీయా సంయుక్త కమిషనర్ టి.చంద్ర శేఖరఆజాద్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కమిషనర్ జి. మాదవి, వివిధ దేవస్థానాలకు చెందిన ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - తెనాలి

రూరల్ గ్రామం బుర్రిపాలెంలో ఆదివారం శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డిసీజ్ ఫ్రీ తెనాలి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులకు షుగర్, బిపి కి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శారద మాట్లాడుతూ శారీరక వ్యాయామం, ఆహార నియమాలు పాటిస్తూ వైద్యుల సూచనలు పాటించాలని రోగులకు సూచించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ ఎన్ శ్రీనివాసరావు, వాలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండి మెడలో ఎస్‌వికే ఆర్ హంస వారి బ్లిస్ వ్యాలీ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

ఎం.టి.ఎం.సి పరిధిలోని గుండిమెడ గ్రామంలో సుమారు 40 ఎకరాలలో ఎస్ వి కే ఆర్, హంస వారి బ్లిస్ వ్యాలీ మెగా బ్రోచర్ కార్యక్రమం ఆదివారం ఉదయం వెంచర్ ప్లాట్ లలో అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఏపీ మెడికల్ సర్వీసెస్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టిడిపి గుంటూరు పార్లమెంట్ కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టిడిపి గుంటూరు పార్లమెంట్ కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ కష్ణ గుంటూరు పట్టణాలకు చేరువలో, రాజధాని ప్రాంతానికి ఐదు కిలోమీటర్ల దూరంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మాణం కాబోతున్న బ్లిస్ వ్యాలీ వెంచర్స్ అధినేతలకు ఆయన శు భాకాంక్షలు తెలిపారు. అత్యాధునికమైన ప్రమాణాలతో నిర్మాణం చేపట్టే ఈ వెంచర్స్ కస్టమర్ల ఆదరభిమానాలను చూడగానే విధంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. సి ఆర్ డి ఏ అప్రూవల్ తో సర్వాంగ సుందరంగా, అన్ని సదుపాయాలతో ఈ ఓపెన్ ప్లాట్స్ ను అధినేతలు వాసు బాబు, కిరణ్ నిర్మిస్తు న్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతి నిధి దొంతి రెడ్డి సాంబిరెడ్డి, బ్లిస్ వ్యాలీ వెంచర్స్ అధినేతలు వాసు బాబు, కిరణ్ , గుండిమెడ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

లైన్‌మెన్ ఖాళీలను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు టౌన్ -1 డివిజన్ పరిధిలోని ఖాళీ అయిన లైన్‌మెన్ పోస్టులు అర్హులైన అసిస్టెంట్ లైన్ మెన్‌లతో భర్తీ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి దాసరి వెంకటేశ్వరరావు కోరారు. గుంటూరు టౌన్-1డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, గుంటూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌కు యూనియన్ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఇంజినీర్ పోస్టులు, వివిధ ఖాళీలు భర్తీ చేస్తున్నారని, కానీ జె అండ్‌ఎం స్టాఫ్ ఖాళీలు భర్తీ చేయటంలో అలసత్వం వహించటం తగదు అని అన్నారు. తక్షణమే ఖాళీలు అర్హులైన అసిస్టెంట్ లైన్ మెన్ లతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్ అరుణ

అమరావతిలో న్యూరాలజీ వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గుంటూరు

అమరావతి యోగాశ్రమ ంలో ఆదివారం విజయవాడ ప్రభుత్వ వైద్యశాల న్యూరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఉప్పుటూరి అరుణ కుమారి ఆధ్వర్యంలో ఉచిత న్యూరాలజీ వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 80 మందికిపైగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణకుమారి మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు ఉప్పుటూరి జయలక్ష్మి, వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ఈ వైద్యశిబిరం నిర్వహించామని తెలిపారు. వైద్య శిబిరంలో విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్యులు డాక్టర్ ఆదిత్య, డాక్టర్ సందీప్‌రెడ్డి, డాక్టర్ నిఖిల్, డాక్టర్ భాగ్య, డాక్టర్ కార్తికేయ, డాక్టర్ అవినాష్ పాల్గొని వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో యోగాశ్రమ నిర్వాహకులు డాక్టర్ వావిలాల సుబ్బారావు, కౌశిక్ ప్రసాద్, ఉప్పుటూరి మోహనరావు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జి.కోటేశ్వరరావు, ఎన్.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు జి.సుబ్బారావు, చేగు ఉదయభాస్కర్, యు.రాజశేఖర్‌రావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, ప్రజాసంఘాల నాయకులు పాశం రామారావు, ఎస్.కాళిదాసు, బి.సూరిబాబు, ఎన్.వజ్రాంజలి, బి.కాశీ అన్నపూర్ణ, డి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీతో రాష్ట్ర నాయకులు

యుపిహెచ్‌సి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీ ఆవిర్భావ సభ ఆది వారం పాతగుంటూరు సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎ.విజయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెఏసి ఆఫ్ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ వర్కర్స్ రాష్ట్ర చైర్మన్ ఏవి నాగేశ్వరరావు మాట్లాడుతూ యుపిహెచ్‌సి ఉద్యోగులకు పిహెచ్‌సి ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని,లేదా నేషనల్ హెల్త్‌మిషన్ నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగులకు ఎన్‌హెచ్‌ఎం ఆర్‌ఓపి ప్రకారం ఉద్యోగులకు హెచ్.ఆర్ పాలసీ అమలుచేసి వార్షిక ఇంక్రిమెంట్లు, హెల్త్ ఇన్సూరెన్స్, టర్మ్ ఇన్సూరెన్స్ వంటివి ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ ఉద్యోగులు హక్కుల కోసం పోరాటాలు చేయాలని, యుపిహెచ్‌సి ఉదోగులు చేసే ప్రతి పోరాటంలో సిఐటియు అండగా ఉంటుందన్నారు. జేఏసీ జిల్లా సెక్రెటరీ జనరల్ బి.ముత్యాలరావు మాట్లాడుతూ యుపిహెచ్‌సి ఉద్యోగులు గతంలో కూడా అనేక పోరాటాలు నిర్వహించారని, ఆపోరాటాల ద్వారా జీతాలు పెంపు, ఇతర సమస్యల పరిష్కారం చేసుకున్నారని గుర్తు చేశారు. అదేవిధంగా భవిష్యత్తులో యూపిహెచ్‌సి ఉద్యోగులు చేసే ప్రతి పోరాటంలో అండగా ఉంటామని తెలియజేశారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరూ విభాగాలతో సంబంధం లేకుండా ఐక్యంగా ఉండాలని, అప్పుడే సమస్యలు పరిష్కరించుకునే శక్తి వస్తుందన్నారు. డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖ పట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభల జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు అనం తరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా బి.ముత్యాలరావు, అధ్యక్షులుగా ఎ.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పి.విజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులుగా కమలాకర్ గుప్తా, అబ్దుల్ రబీబ్, శ్రీనివాసరావు, రాజేష్, సుధీర్, ఎన్నుకున్నారు.

అదనపు సొమ్ము అడిగితే జరిమానా

నిబంధనల ప్రకారం వైద్య సేవలు అందించాల్సిందే

ఆస్పత్రుల వారు ఇబ్బంది పెడితే ఫిర్యాదు చేయవచ్చు

ఎన్‌టిఆర్ వైద్య సేవల జిల్లా కో ఆర్డినేటర్ విజయ ప్రకాష్

విజయ ప్రకాష్

ఎన్‌టిఆర్ వైద్య సేవల ద్వారా ఎంపిక చేసిన ప్రైవేటు ఆస్పత్రులలో రోగులకు తగిన వైద్య సేవలు అందించా ల్సిందేనని, అదనపు సొమ్ము వసూలు చేస్తే జరిమానాలు విధించి ఈ సొమ్మును తిరిగి రోగికి ఇప్పి స్తామని ఎన్‌టిఆర్ వైద్య సేవల జిల్లా కో ఆర్డినేటర్ విజయ ప్రకాష్ తెలి పారు. ఈ అంశంలో ఏ ఆస్పత్రికి మినహాయింపు లేదన్నారు. జిల్లాలో మొత్తం 155 నెట్ ఆస్పత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్య సేవ లు పొందవచ్చు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంట ర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియ జేశారు.

ఎన్‌టిఆర్ వైద్య సేవల(ఆరోగ్యశ్రీ) అమలు తీరు?

జిల్లాలో ఎన్‌టిఆర్ వైద్య సేవలకు ఎంపిక చేసిన అన్ని ఆస్పత్రుల్లో రోగులకు తగిన సేవలు అందుతున్నాయి. ఆరోగ్య శ్రీ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి 3257 రకాల చికిత్సలు ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణేశించింది. రూ.25 లక్షల వరకు ఖర్చు అయ్యే సేవలు ఉచితంగా అందివ్వాలి. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు వారిపై ఆధారపడిన వారికి రూ.2 లక్షల వరకు ఉచిత చికిత్సలు అందిస్తారు. 2500 రకాల చికిత్సలు ఉంటాయి. వర్కింగ్ జర్నలిస్టులకు, వారిపై ఆధారపడిన వారికి కూడా 2500 వ్యాధులకు చికిత్స అందిస్తారు. అమృత ఆరోగ్య స్కీమ్ ద్వారా అనాధలు, నిరాశ్రయులకి 1059 చికిత్సలు ఉచితంగా చేస్తారు. ఆరోగ్య రక్ష పథకం ద్వారా ఎగువ మధ్య తరగతి వారికి 1044 చికిత్సలు, ఆయుష్మాన్ భారత్ ద్వారా కార్డులు పొందిన వారికి 1949 చికిత్సలు అందు తాయి. ఈ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరూ సంబంధిత ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత చికిత్సలు పొందవచ్చు.

వైద్య చికిత్సల్లో అదనపు వసూళ్లపై ఫిర్యాదులు?

ఆరోగ్యశ్రీ ట్రస్టు రూపొందించిన నిబంధనల ప్రకారం చేయాల్సిన ఉచిత చికిత్సల్లో ఆస్పత్రుల వారు సొమ్ములు వసూలు చేయ కూడదు. శస్త్ర చికిత్సలకు కొన్ని చోట్ల అదనపు వసూళ్ల చేసిన సందర్భంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదులపై విచారణ చేస్తాం. అదనపు సొమ్ము వసూలు చేసినట్టు నిర్ధారణ అయితే ఆస్పత్రికి జరిమానా విధిస్తాం. అలాగే సంబంధిత సొమ్మును తిరిగి రోగికి ఇప్పి స్తాం. ప్రస్తుతం కొన్ని పిటీషన్లు విచారణలో ఉన్నాయి. గతంలో కొంత మందికి జరిమానా లు విధించి రోగులకు తిరిగి సొమ్ము ఇప్పించాం.

ఏడాదికి రూ.25 లక్షల ఉచిత వైద్య సేవలు కొనసాగుతున్నాయా?

నిరుపేదలను ఆదుకునేందుకు యూని వర్సల్ హెల్త్ పాలసీ ప్రకారం ప్రతి కుటుంబా నికి ఏడాదికి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం తగిన ఆదేశాలు ఇచ్చింది. ఈమేరకు జీవో 122 జారీ చేసింది. ఈమేరకు ఆరోగ్యశ్రీ ఉన్న అన్ని కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం.

జిల్లాలో గత ఎన్‌టిఆర్ వైద్య సేవల ద్వారా అందిన సేవలు?

2019-20లో 30,218 మందికి చికిత్సలు, శస్త్ర చికిత్సలు జరగ్గా రూ.81.20 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. 2020-21లో 37,697మందికి రూ.108.13 కోట్లు, 2021-22లో 49,805 మందికి రూ.135. 08 కోట్లు, 2022-23లో 63,572 కోట్లు, 2023-24లో 1,32, 228 మందికి 307.28 కోట్లు, 2024-25 లో 1,69,164 మందికి రూ.379.44 కోట్లు, 2025-26లో గత అక్టోబరు 31 వరకు 1,13,785 మందికి రూ. 239.71 కోట్లు ఖర్చు చేశాం.

ఆరోగ్య కార్డుల జారీలో జాప్యం?

పిఎంజెఎవై కార్డుల జారీకి ఇప్పటి వరకు జిల్లాలో 300877 కుటుంబాలకులోని కుటుంబ సభ్యులు 909055 మంది ఉండగా వీరిలో 8,74,388 మందికి ఈకేవైసి పూర్తిచేశాం. కార్డులు ఎవరైనా ఆన్‌లైన్‌లో తీసుకోవచ్చు. అలాగే 70 ఏళ్ల దాటిన వృద్ధులు 1,32,412 కుటుంబాలు వారు ఉండగా 154 589 మంది ఉన్నట్టు గుర్తించాం. వీరిలో ఇప్పటి వరకు 14,353 మందికి ఈకేవైసి పూర్తి చేశాం. ఇంకా 1,40,236 మందికి ఈకేవైసి చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ పురోగతిలో ఉంది.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నిర్మాణ వ్యర్థాలను తొలగించే బాధ్యత కాంట్రాక్టర్‌దే

ప్రజాశక్తి-గుంటూరు : నగరంలో అభివృద్ధి పనులు నిర్వహించిన అనంతరం నిర్మాణ వ్యర్థా లను సంబంధిత కాంట్రాక్టర్ తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీ నివాసులు తెలిపారు. ఆదివారం కమిషనర్ పెదపలకలూరు, రత్నగిరి కాలనీ, అరండల్‌పేట తదితర ప్రాంతాలలో పర్యటించి అభివృద్ధి పను లను, సదరు ప్రాంతాలలో పారిశుధ్య పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యల పై సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పెదపలకలూరు, రత్నగిరి కాలనీ, అరండ ల్‌పేటలలో పర్యటించి, సదరు ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న సైడు కాలువలు, రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లా డుతూ, అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, పనులు జరిగే సమయంలో ఎమినిటి కార్యదర్శులు పనులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు పూర్తైన అనంతరం నిర్మాణ వ్యర్థాలను పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ తప్పని సరిగా తొలగించేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. అభివృద్ధి పనులు పూర్తైన తరువాత వ్యర్థాలను అక్కడే వదిలేస్తున్నారని ప్రజల నుండి ఫిర్యా దులు వస్తున్నాయని, సదరు వ్యర్థాల వలన ప్రజలు ఇబ్బందులు పడు తున్నారన్నారు. అనంతరం సదరు ప్రాంతాలలో పారిశుధ్య పనులను తనిఖీ చేసి, డోర్ టు డోర్ చెత్త సేకరణ నూరు శాతం తడి పొడి చెత్త లుగా విభజించి జరగాలన్నారు. మధ్యాహ్నం పూట తప్పనిసరిగా సైడు కాల్వలను శుభ్రం చేయించాలని, సైడు కాలువలు శుభ్రం చేయుటకు ఆక్రమణలు ఏమైనా అడ్డుగా ఉంటే వాటిని తొలగించి, కాలువలను శుభ్రం చేయించాలన్నారు. ప్రజలు వ్యర్థాలను కాలువల్లో మరియు రోడ్ల పై వేయకుండా తడి పొడి వ్యర్థాలుగా విభజించి నగర పాలక సంస్థ పారి శుధ్య సిబ్బందికి అందజేయాలని తెలియచేశారు. పర్యటనలో పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభల్లో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న కళాధర్

భారతదేశంలో ఆర్థిక సంస్కరణల అనంతర కాలంలో ఉన్నత విద్యా రంగంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయని, పెద్ద ఎత్తున ప్రైవేటీకరణ జరుగుతుందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ అన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సంఘం 50వ జిల్లా మహాసభలలో కళాధర్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో 17 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఉన్నాయని, గత 15 ఏళ్లుగా నియామకాలు లేకపోవటంతో నాణ్యత క్షీణిస్తుందన్నారు. ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు ప్రస్తుతం నాలుగు వేలకుపైగా ఖాళీలు ఉన్నాయన్నారు. కొన్నిచోట్ల కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీతో బోధన చేయిస్తున్నారన్నారు. విశ్వవిద్యాలయాల నిర్వహణ లోపభూయిష్టంగా ఉందని, వైస్‌ఛాన్సలర్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్ నియామకం పూర్తి రాజకీయ కోణంలో చేపడుతూ, నైపుణ్యానికి ప్రాధాన్యత లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో బ్రౌన్‌ఫీల్డ్ యూని వర్సిటీల పేరుతో గీతం, కోనేరు లక్ష్మయ్య, విజ్ఞాన్, విట్, ఎస్‌ఆర్‌ఎం, అమత, మోహన్‌బాబు, అపోలో మొదలైన ప్రైవేట్ డీమ్డ్ యూనివర్సిటీలు ఉన్నాయని, వాటిలో సాంకేతికపరమైన కోర్సులను మాత్రమే అందిస్తున్నాయన్నారు. ముఖ్యంగా రిజర్వేషన్లు అమలు కావట్లేదని, ఫీజుల పై చేర్చుకునే విద్యార్థుల సంఖ్యపై పరిమితి లేదన్నారు. ప్రభుత్వ నియంత్రణ కూడా ఉండట్లేదన్నారు. అదే విధంగా రాష్ట్రంలోని 280 ఇంజనీరింగ్ కాలేజీలు, 200 ఎంబిఎ, ఎంసిఎ కాలేజీలు 150, బి ఫార్మసీ కళాశాలల్లో 90శాతంపైగా ప్రైవేట్ రంగంలోనే ఉన్నాయని, వీటిలో విద్యా ప్రమాణాల తనిఖీకి సరైన యంత్రాంగం లేదన్నారు. రాష్ట్రంలో 1353 డిగ్రీ కాలేజీల్లో 1080 ప్రైవేటు, 152 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉన్నాయన్నారు. ఎంతో చరిత్ర కలిగిన ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం ఫలితంగా గత రెండు సంవత్సరాల్లో అన్ ఎయిడెడ్ కాలేజీలుగా 70 కాలేజీలు మారాయని, మిగిలిన 50 ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల్లో కొద్ది సంఖ్యల్లో మాత్రమే సిబ్బంది ఉన్నారన్నారు. పేద విద్యార్థులు ముఖ్యంగా దళితులు గిరిజన బీసీ విద్యార్థులు ఫీజు రియంబర్స్మెంట్ సమస్యలు ఎదుర్కొంటున్నారని, జీవో నెంబర్ 77 జారీ చేసి, పిజి కోర్సులు ప్రైవేటు సంస్థల్లో చేస్తే ఫీజు రియంబర్స్మెంట్ ఉండదని ఉత్తర్వులు జారీ చేయటంతో వేలాదిమంది విద్యార్థులు నష్టపోతున్నా రన్నారు. జీవో నెంబర్ 77 రద్దుచేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విశ్వవిద్యాల యాల్లో ఖాళీలను భర్తీ చేయాలని, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, ప్రైవేటు యూనివర్సిటీలపై నియంత్రణ ఉండాలని, డిగ్రీ కళాశాలలను పటిష్ట పరచాలని, ప్రైవేటు యూనివర్సిటీల్లో ప్రమాణాలు మెరుగుపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసన్నకుమార్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కిరణ్, మాజీ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎన్.భావన్నారాయణ, డివైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ కృష్ణకాంత్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి షేక్.సమీర్, జిల్లా అధ్యక్షులు కె.పవన్ కుమార్, సహాయ కార్యదర్శి అన్సారీ, కిరణ్ దాసరి, అమృత వర్షిణి, ఉపాధ్యక్షులు సౌమ్య, రూపస్, కమిటీ సభ్యులు యశ్వంత్, సుర్జిత్, అజయ్, అభిలాష్, అనిల్,తదితర విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.